క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బెల్లయ్యనాయక్



మహబూబాబాద్ రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌గా నియమించినందుకుగాను సీఎంకు బెల్లయ్య నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన అశోక్‌స్టాలిన్

కేసముద్రం : తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.అశోక్‌స్టాలిన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



మహబూబాబాద్ అర్బన్ : యువత క్రీడల్లో రాణించి దేశ ఔన్నత్యానికి పాటుపడాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపీఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసికంగా ధృడంగా ఉంటారని పేర్కొన్నారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎల్ వ్యవస్థాపకుడు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ రవీందర్, రోహిన్, ఆర్గనైజింగ్ సభ్యులు సందీప్ నాయక్, శ్రీపాల్, శివకుమార్, అనిల్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'1962' వాహనం తనిఖీ




నెహ్రూసెంటర్ : మానుకోట జిల్లా కేంద్రంలోని సంచార పశువైద్యశాల 1962 వాహనాన్ని ప్రాజెక్టు సమన్వయకర్త డాక్టర్ భాగీష్‌మిశ్రా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో మందులు, పరికరాలు, రికార్డులను అందుబాటులో ఉంచుకుంటూ వైద్యసేవలు అందించాలన్నారు. మూగ జీవాలకు అందించే వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. సిబ్బంది సేవలను విస్తృత పరిచాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ బత్తిని మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'



నెహ్రూసెంటర్ : రైతుల పక్షాన పోరాటం చేస్తే అక్రమాలు కేసులు బనాయించారని, వాటిని వెంటనే ఎత్తివేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. సాలార్‌తండా గిరిజన రైతులకు అండగా నిర్వహించిన పోరాటాల్లో భాగంగా గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ.. రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే పోరాటాల ద్వారా రైతలకు ఎకరాకు రూ.21లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించారని గుర్తు చేశారు. అక్రమంగా సీపీఐ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టుకు హాజరైన వారిలో సీపీఐ నాయకులు రేషపల్లి నవీన్, రైతులు శివాజీ, మంగ్యా, వెంకన్న, సురేందర్, బాలాజీ ఉన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



కేసముద్రం : మండలంలోని అర్పనపల్లి యూపీఎస్‌లో గురువారం 22 మంది విద్యార్థులకు మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. గ్రామం నుంచి ఉప్పరపల్లి జెడ్పీఎస్ఎస్‌కు నడుచుకుంటూ వెళ్తున్న పేద విద్యార్థులకు సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. గంధం భరత్, గంధసిరి స్వరూప, వెంకన్న, మోడెం రాజు, చీర వెంకన్న, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్ : సోమ్లాతండాలో పోషణ్ పక్వాడాలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు



గూడూరు: దుబ్బగూడెం కేంద్రంలో..



గార్ల : సూర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో..



పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే గుడ్లు, పప్పులు, పౌష్టికాహారం ఆరోగ్యాన్ని కాపాడేందుకు దోహదపడుతాయన్నారు. పోషకాహారం తీసుకుని మహిళలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం పోషకాహారం ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నెల్లికుదురు: సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అనంతాద్రి శ్రీవారి బ్రహ్మోత్సవాలు షురూ



శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్ : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామివారి మంగళాశాసనాలతో స్వయంభూ జగన్నాథ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రిలో గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీస్వయంభూ జగన్నాథ వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి -జ్యోతి దంపతులు, ట్రస్టు సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి బ్రహోత్సవాల్లో భాగంగా నేడు ధ్వజారోహణం, గరుడ ప్రసాదం పంపిణీ పూజలు ఉంటాయని అర్చకులు తెలిపారు. .

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవ కల్యాణం

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొలువుదీరిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీవారి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లకు పూజలు చేసి ప్రజలందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞికులు, సహ అర్చకులు శ్రీవారి కల్యాణోత్సవం జరిపించారు. ఆలయంలో శోభాయమానంగా అలంకరించిన వేదికపై స్వామివారు, అమ్మవార్లను కొలువుదీర్చి కనుల పండుగగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు.

గుడుంబా స్వాధీనం



తొర్రూరు : డివిజన్ కేంద్రంలో నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి తెలిపారు. తొర్రూరు పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలోకి పోలీసులు వెళ్లగా అప్రమత్తమైన నిందితుడు గుడుంబా బాటిళ్లు, ద్విచక్రవాహనాన్ని వదిలివెళ్లాడు. దాదాపు 20 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు, వాహనాన్ని సైతం సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు మండలంలోని పోలెపల్లి శివారు తాన్యాతండాకు చెందిన గుగులోత్ వెంకన్నగా గుర్తించారు.

దంతాలపల్లి : మండలంలోని రేపోణి గ్రామంలో గురువారం పోలీసులు తనిఖీ చేస్తుండగా ఉర్లుగొండ రాములు ఇంట్లో గుడుంబా ఉందనే పక్క సమాచారంతో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణాకర్ తెలిపారు.

గార్ల : మండలంలోని జీవంజిపల్లి గ్రామానికి చెందిన ధరావత్ రాంబాబు ఇంటిపై గురువారం పోలీసులు దాడి చేసి 11 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా గుడుంబా విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కుష్ఠు నిర్మూలనకు పాటుపడాలి

- డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి



ఆనెపురంలో సర్వే నిర్వహిస్తున్న వైద్యబృందం

మరిపెడ రూరల్ : కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని డిప్యూటీ పారా మెడిక్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి అన్నారు. కుష్ఠు వ్యాధి గుర్తింపు ఇంటింటి సర్వేలో భాగంగా గురువారం మరిపెడ మండలంలోని ఆనెపురం, స్టేజితండా గ్రామపంచాయతీ పరిధిలోని జోగ్యతండాలో వైద్యబృందం పర్యటించి అనుమానితులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వనాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే(ఎండీటీ) ద్వారా చికిత్స అందించి నయంచేయ వచ్చన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ్‌కుమార్, పీఎంఓ కృష్ణ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

97 అనుమానిత కేసుల గుర్తింపు

దంతాలపల్లి : మండల ప్రజావైద్యశాల పరిధిలో నర్సింహులపేట, దంతాలపల్లి మండలంలో గురువారం వరకు 97 అనుమానిత కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించినట్లు సీహెచ్ఓ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గడపకు తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. శరీరంపై మొద్దుబారిన, రాగివర్ణం, స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించామన్నారు. ఈ నెల 24వ తేదీ తర్వాత వైద్యశాలలో క్యాంప్ ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్యులతో పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే కుష్ఠు నివారణ మందులు అందజేస్తారు. ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష



సమావేశంలో మాట్లాడుతున్న అంబరీష

గార్ల : వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష హెచ్చరించారు. గురువారం మండలంలోని ముల్కనూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, వైద్యసిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్ వేయాలని, విషజ్వరాలను అరికట్టేందుకు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి మురుగు నీరు నిల్వ లేకుండా చేయించాలని సూచించారు. వైద్యసిబ్బంది సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ, విధుల పట్ల సమయపాలన పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. సమయపాలన పాటించని వైద్యసిబ్బందిపై ఏమైనా ఫిర్యాదులు వస్తే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సమావేశంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, సీహెచ్ఓలు కృష్ణార్జున్ రావు, సక్కుబాయి, హెచ్ఈఓ శ్రీహరి, హెచ్ఎస్‌లు రాధాకృష్ణ, పద్మ, ఏఎన్ఎంలు లలిత, పద్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



గూడూరు: నివాళులర్పిస్తున్న మురళీనాయక్



పెద్దవంగర: నివాళులర్పిస్తున్న చందర్‌రావు

గూడూరు : మండలంలోని ఊట్ల గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఆర్మీ జవాన్ లింగాల వెంకటేశ్వర్లు బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరజవాన్ వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాజులగట్టుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త సుఖ్య నాయక్, పడమటితండా జీపీకి చెందిన బానోత్ బాలు, అజ్మీరా భూలి, మాలోత్ మాన్‌సింగ్ మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోత్ కొమ్మాలు నాయక్, బొల్లికొండ మధుగౌడ్, చంటి స్వామి, రసూల్, వీరాస్వామి,యాకయ్య పాల్గొన్నారు.

డోర్నకల్ : మండలంలోని తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చింతకాయల యాదగిరి(72) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా గురువారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ యాదగిరి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పగడాల అంజయ్య, తోటలాలయ్య, లాల్‌మియా, మన్మథరావు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

పెద్దవంగర : వైద్య, రాజకీయ రంగాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అందించిన సేవలు మరువలేనివని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుధాకర్‌రావు కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం సుధాకర్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు, శైలజరావు, ముత్తినేని శ్రీనివాస్, రామచంద్రయ్య శర్మ, మల్లికార్జున్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం

బయ్యారం : టీపీటీఎఫ్ మండల ప్రధానకార్యదర్శిగా రామ ప్రవీణ్‌ను నియమించారు. గురువారం బయ్యారంలో మీరా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమిరె ఉప్పలయ్య మాట్లాడారు. నాయకులు లక్ష్మయ్య, హనుమంతు, వెంకటేశ్వర్లు, రమేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా వీరబాబు



మరిపెడ రూరల్ : మహబూబాబాద్ జిల్లా స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) కార్యదర్శిగా మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన పెద్దబోయిన వీరబాబు నియమించారు. గురువారం వరంగల్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ నాయక్ ఈ నియామకాన్ని ప్రకటించినట్లు తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం కలగొద్దు

గూడూరు : ఎండాకాలం, వానాకాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏడీఈ కె.కవిత అధ్యక్షతన డివిజన్ పరిధిలోని గూడూరు, అయోధ్యపురం సెక్షన్ల విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏఏఓ రమేష్, ఏఈ ప్రణీత్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 8:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రణీత్ గురువారం ప్రకటనలో తెలిపారు. గూడూరు వడ్డెరగూడెం లైన్‌లో విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కొనసాగుతున్న 'ఉపాధి' తనిఖీ



తొర్రూరు రూరల్ : మండలంలోని 29 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు గురువారం సైతం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్కే సిలార్ సాహెబ్ మాట్లాడుతూ.. గతేడాది జరిగిన చెరువులు, కుంటల పూడికతీతలు, సాగునీటి కాల్వలు, హరితహారంలో మొక్కలు నాటడం, పెంచడం వంటి అనేక రకాల పనుల తీరు, కూలీలకు అందించిన నగదు చెల్లింపులపై తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల తర్వాత గ్రామ, మండల సభలను నిర్వహించి వివరాలను వెల్లడించి, పనుల తీరు, డబ్బుల చెల్లింపులో తప్పులు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తనిఖీల బృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొంగుబంగారం 'జలిదేవి'

- జాతరలో భక్తుల మొక్కులు చెల్లింపు



గుట్ట నుంచి కంకవనం తీసుకొస్తున్న పూజారులు

గంగారం : కోరినవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జలిదేవి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గంగారం మండలంలోని బావురుగొండలో బంగారు వజ్జయ్య, జలిదేవీలను గుట్ట నుంచి గురువారం ప్రధాన పూజారులు కంకవనాన్ని గద్దెలపైకి తీసుకొచ్చారు. గద్దెలపైకి దేవతలను తీసుకొస్తుండగా గ్రామస్తులు బిందెలతో నీళ్లు ఆరబోశారు. పిల్లలు లేని వారు వరంపట్టారు. అనంతరం దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించగా గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తలపతులు, వడ్డెలు, ప్రధాన పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలపతి (ప్రధాన పూజారి) వజ్జయ్య, వడ్డెలు దారం సమ్మయ్య, దారం రాజేష్, మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర పోతయ్య, మాజీ ఎంపీటీసీ వజ్జ సమ్మక్కసారంగపాణి, కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, వజ్జ వెంకటేశ్వర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

నెహ్రూసెంటర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని ఓడించడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా సీపీఎం కాంగ్రెస్ పార్టీతో సీట్ల సర్దుబాటుకు సిద్ధంగా ఉందన్నారు. బీజేపీని నిలువరించే విధంగా ఇండియా కూటమి ఏర్పాటు చేయగా పలుమార్లు చర్చలు జరిగాయని తెలంగాణలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు జరిగితే ఒక స్థానం నుంచైనా పోటీ చేసేందుకు పార్టీ సిద్ధమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాలు, 69 భూపోరాట కేంద్రాల్లో సుమారు లక్షపైగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో వేసవి కాలం రాకముందే తాగునీటి ఎద్దడి ఎదురవుతుందని జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో యువత సత్తా చాటాలి

తొర్రూరు రూరల్ : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి యువత సత్తా చాటాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్‌యాదవ్ కోరారు. గురువారం మండలంలోని పోలెపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో పలు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇప్పుడు తమను విధులకు హాజరుకావొద్దని ఉత్తర్వులు జారీచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని గూడూరు, తొర్రూరు, గార్ల, మరిపెడ ఆస్పత్రుల్లో అయినా సర్దుబాటు చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాధవి, శారద, యాకలక్ష్మి, అశోక్, శ్రీనివాసరావు, నర్సయ్య, లత, శిరీష, శ్రావ్య, మునేష్, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సూపర్‌ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రతి సూపర్‌ఫాస్ట్ రైళ్లల్లో సాధారణ బోగీలు పెంచాలని ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో రజాకార్ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా సినీనటీ అనసూయ పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్లు రంజిత్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

రాజ్యసభ సీటు ఇవ్వాలి

బయ్యారం : పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న టీపీసీసీ సభ్యుడు వాంకుడోత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు రాజ్యసభ సీటు ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఏకమత్రో వ్యవస్థాపక అధ్యక్షుడు వాంకుడోత్ మంగీలాల్ నాయక్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు లక్ష్మీనారాయణ నాయక్ చేసిన కృషి మరవలేనిదన్నారు. సమావేశంలో నాయకులు భావుసింగ్, అర్జున్, మహేష్, వెంకన్న, చింటు ఉన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీ పరీక్షలు నిర్వహించారు. నాయకులు రాకేష్, హస్మా, మహేష్, నవీన్, ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

కేసముద్రం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి ఎద్దడి నివారణపై పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ హరిప్రసాద్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మంచినీటి బావులు, బోరింగ్‌లను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చేతిపంపులకు మరమ్మతులు

మరిపెడ రూరల్ : వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడికి చర్యలు తీసుకుంటున్నట్లు పాంబండతండా గ్రామ కార్యదర్శి రవి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి పంపు మెకానిక్ బిచ్చు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌పై కానిస్టేబుళ్లపై దౌర్జన్యం..?

కేసముద్రం: ఇసుక రవాణా చేస్తున్న సంబంధిత వాహన డ్రైవర్‌పై కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కి చెందిన ఓ ఇద్దరు కానిస్టేబుళ్లు దౌర్జన్యానికి పాల్పడినట్లు కనిపిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో గురువారం రాత్రి వైరల్‌గా మారింది. మండల కేంద్రంలో వారంరోజుల క్రితం ఇసుక రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని కానిస్టేబుళ్లు ఆపారు. ఈ క్రమంలో డ్రైవర్, కానిస్టేబుళ్ల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. కాగా డ్రైవర్ ఒంటిపై దుస్తులు లేకపోవడంతో, అతడిని పట్టుకుని కానిస్టేబుళ్లు లాగుతున్న ఫొటో సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. కాగా సదరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

పోలీసుల కవాతు

డోర్నకల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు డోర్నకల్ పట్టణంలో కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ అమ్మపాలెం క్రాస్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా బైపాస్ రోడ్డు వరకు పోలీసులు కవాతు నిర్వహించారు.